నేల

ఓ నేలా! మాతల్లీ! నీకెంతదగ్గరమ్మా మేము! నీకూ మాసుబ్బన్నకూ మధ్య చాపనా లేదు. నీకూ మా సుబ్బన్న దేహానికి ఒక చొక్కాగాని ఓపంచెగాని అడ్డంలేదు. నీకూ మా సుబ్బన్నకూ మధ్య నీలోనుంచి తీసిన ఓ నాపరాయినా లేదు.

మా సుబ్బన్న ఎక్కడినుంచి వచ్చాడు తల్లీ! నీ పిల్లలందరూ నీలోంచే వచ్చారు. ఆకాశంలోంచి వచ్చిన కోటీశ్వరులు నీ రొమ్ముమీద నించో లేక, పడుకో లేక, కూర్చో లేక ఏ మూడంతస్తుల మేడలో కట్టుకుంటే ఏమి?

మా సుబ్బన్న తల్లెవరు తండ్రెవరు? మా సుబ్బన్న దేవూరు, ఏజిల్లా, ఏనాడు! మా సుబ్బన్ననడిగినా వాడే చెప్ప లేకపోయాడు! హైదరాబాదు వీధుల్లో పెరిగాడు, హైదరాబాదు హోటళ్ళలో బల్లలు కడిగాడు, "చా"లు అందిచ్చాడు, హైదరాబాదు రిక్షాలు లాగాడు, హైదాబాదులో పేపర్లు ఇంటి ఇంటికి పంచాడు!

మాసుబ్బన్న క్రిందపడుకుంటాడు. వాడు వేసుకునేందుకు చాపలేదు, పక్కలేదు, పరుపులేదు, మంచంలేదు! వాన వస్తే, ఎండకాస్తే; తడుస్తాడు, ఎండుతాడు. ఏపంచనో నిలుచుంటాడు, ఏమూలనో పండుకుంటాడు!

హైదరాబాదు సిమెంటుగోడ్లు, హైదరాబాదు గల్లీలు మురుకుతూములు, సారాదుకాణాలు, పానుదుకాణాలు, కంపులు, ఈగిలు, దోమలు, చేతంకళ్ళులు, బాకులు జంబి

గాలు సుబ్బన్నను అరికట్టలేకపోయాయి! దీనికి కారణం పద్దెనిమిదిఏళ్ళ ఈడువాడయిన సుబ్బన్న 1942 వ సంవత్సరంలో మొట్టమొదట ఉద్భవించిన సైకిలు రిక్షాలలో ఒకదానిని తొక్కుతూ అద్దెవసూలుచేయడంలో వచ్చింది.

2

సుబ్బన్నకు ఉరుదూ తెలుగు, తెలుగుఉరుదూ, తెలుగుకన్నడం, కన్నడంఉరుదూ, ఉరుదూకన్నడం, మహారాష్ట్రికన్నడం, కన్నడ మహారాష్ట్రం- మహారాష్ట్రిఉరుదూ, తెలుగుమహారాష్ట్రం, మహారాష్ట్రితెలుగు, తెలుగుకన్నడ ఉరుదు- ఉరుదు తెలుగు కన్నడం, తెలుగు కన్నడ ఉరుదు వగైరా వగైరా అన్నిభాషలూ వచ్చును.

ఆరోజు రిక్షాలో ఇద్దరు మహారాష్ట్రి బాలికలను తీసుకుపోతున్నాడు. మాట్లాడుకున్నది పాంచణాపైసలు. అక్కడ దిగగానే ఒక అణా ఎక్కువడిగాడు! ఆ బాలికలిద్దరూ మండిపడ్డారు. "ఏమిరాపండీ! నువ్వు చదువుకోకపోవడం మూలాన నీబుద్ధులు మురికిలోపొర్లేపందిబుద్ధులు" అని ఆ బాలికలిద్దరూ ఆ అయిదణాలు రిక్షాముందు నేలమీదపడేసి విద్యాలయంలోనికి చక్కాబోయారు.

ఆలాగే మాసుబ్బన్న నిలబడిపోయాడు! వాడికున్న ఆ కొంచెంమనస్సు ముక్కముక్కలయిపోయింది. నేను పందిని! నేను మురికిలోపొర్లుతాను! నేను పందిని! నావిపందిబుద్ధులు!" వాడి ఆలోచన, వాడిమానసికప్రపంచంచుట్టూ రెచ్చకొట్టబడిన తేనెటీగలా తిరిగింది.

ఓ నేలతల్లీ, నీకు మూరుడు సుబ్బన్న కళ్ళల్లో వేడినీళ్ళు తిరిగిన సంగతి నువ్వు చూశావమ్మా! ఓ నేలతల్లీ ఎంతమందమ్మా నీబిడ్డలకు ఈలాంటి అవమానాలు!

కోటీశ్వరుల దొంగమార్కెట్టులలో వర్తకనీతిప్రకారం తమ ఆత్మలకు విషం, మకిలీ, దుర్గంధము పూసుకొని మానవజీవితకశ్మలంలో పందులకన్న అధ్వాన్నంగా, లుక లుక పురుగులకన్న నీచంగా ఓలాడినవారు ఆకాశంలో ఎగిరే అందమయిన పక్షులాతల్లీ! ఈఆలోచన సుబ్బన్న హృదయంలో పుట్టుదామని ప్రయత్నించింది కాని వాడు చదువుకోలేదు, వాడు కవిగాడు, ప్రభుత్వోద్యోగికాడు!

సుబ్బన్న వేడికంటినీరు తుడుచుకునేందుకు పైన కండువాఅన్నా లేదు. జుమారత్ బజారులో అమ్మేబట్టలు నేల సంబంధమైనబట్టలే. అవి ఇస్త్రీలు ఎరగవు. మా సుబ్బన్న చొక్కా చిరుగులతో ఇరవై ఏళ్ళ జీవితంతో, ఇరవై ఏళ్ళ చెమటలతో, మురికితో మానవజీవిత కష్టనిష్ఠూరాలతో చివికి చచ్చిదారాలపోగులైనపాత! రెండణాలకు జుమారత్ బజారులో సుబ్బన్న కొన్నదే

"నేను పందిని, సదువురాదు!" ఆ రిక్షాను సుబ్బన్న ఆ రిక్షాయజమానికి తిరిగి ఇచ్చేశాడు.

ఓ నేలతల్లీ! గోలుకొండకుపోయేదారిలో పొలంలో నీ హృదయంపైన పండుకొని మా సుబ్బన్న వెక్కి వెక్కి ఏడ్చినసంగతి నీకు జ్ఞాపకం లేదూ! ఓ నేలతల్లీ! నీ మనస్సులో నిర్మలంగా ప్రత్యక్షం అయ్యే ఉస్మాన్ సాగరులోనా నీ సుబ్బన్న చచ్చిపోదామని దిగాడు! దిగినమాట వాస్తవమే

మోకాలులోతుకుపోయాడు; నడుంవరకు దిగాడు, రొమ్ము ములిగేటంతవరకూ ముందుకు నడిచాడు కంఠం నీళ్ళల్లో మేల మూడింది. అటుచూచాడు ఇటుచూచాడు, దూరంలోఉన్న నీ వక్షోజాలయిన కొండలు చూచాడు. నీ నవ్వులైన పువ్వుల చెట్లు చూశాడు. నీ ఆలోచనలైన పొలాలు చూచాడు! "రామ రామా" అని ముందుకు నడిచాడు.

3

కాని ఓ నేలతల్లీ! అక్కడ నువ్వు కొంచెం పైకి ఉబికి ఉన్నావని వాడికేం తెలుసు! నీరు కంఠంనుంచి రొమ్ముకిందకు దిగింది. ఇంకాముందుకు వెడితే నడుంకిందకు వచ్చింది. మా సుబ్బన్న ఎదురుగుండా దూరంగావున్న ఆ కొండలు చూచాడు. ఆ గుట్టలావతల ఏమివుంటుంది? పొలాలు, గుట్టలు, వానిఅవతల ఇంకాపొలాలు, గుట్టలు, అరకలుకట్టుకొని వ్యవసాయాలు. పశువులు,పొలాలు, పూల చెట్లు,గ్రామాలు, హైద్రాబాదువంటి పట్టణాలు, రైళ్ళు, మోటార్లు అట్టా అట్టా తాను వెళతాడు. ఎక్కడ, భూమి ఆఖరైతే అక్కడ ఆగుతాడు. ఆతర్వాత ఆకాశమో ఏమో!

మాసుబ్బన్న వెనక్కుతిరిగి గట్టెక్కాడు ఓ నేలతల్లీ! నీ హృదయంమీదే నడిచాడు మాసుబ్బన్న. ఉన్న రెండు పాతలు వంటిమీదే ఆరాయి. కడుపులో ఆకలి దావానలం అయినా చెయ్యిచాచి దేహీ అని ఒక్కణ్ణీ అనగలేదు. కాని ఓ నేలతల్లీ! నీబిడ్డలింకా అక్కడక్కడున్నారుసుమా! మా

సుబ్బన్న కింత గంజో, ఇంతపిడచో నాయనా తాగు తిను అన్నారు. మా సుబ్బన్న ముందుకు సాగిపోయాడు.

ఓ నేలతల్లీ! నీబిడ్డలైన తేళ్ళు మా సుబ్బన్నను కుట్ట లేదు! పాములు కరువలేదు! పెద్దపులులు ఘాండ్రుమన లేదు. కాని నీ సవతిబిడ్డలైన పోలీసువాళ్ళు, భూకామందులు, ఏదో చదువుకొన్నవాళ్ళు మా సుబ్బన్నను చూచి ఎవడురావీడు అనుకున్నారు. కోటీశ్వరులకోసం వేసుకొన్న రైలుపట్టాలు కూడా నీ బిడ్డలకు పనికివస్తాయా ఓ నేలతల్లీ! ఆలా రైలుపట్టా మార్గమే పుచ్చుకొన్నాడు మాసుబ్బన్న. కతిపయప్రయాణాలుచేస్తూ హైదరాబాదు చెల్లెలైన పూనా చేరుకున్నాడు.

ఓ నేలతల్లీ! నీ అనుగుకుమారుడు సుబ్బన్న పూనాలో ఏమిచెయ్యాలి? రైలుదగ్గిరనుండి ఊళ్ళోకి. సామానుతీసుకువెళ్ళే కూలివాడయ్యాడు. సుబ్బన్నబట్టలు చూస్తే దొంగ అనుకున్నారు. మొహంచూస్తే హరిశ్చంద్రసంతతి అనుకున్నారు ప్రజలు.

ఒక మహారాష్ట్రుడు తన ఇంటిలో పనివానిగా ఉండమన్నాడు. ఓ నేలతల్లీ! ఆ యజమాని నీ సుబ్బన్నకు గుండులాంటి ఖద్దరు పొట్టిలాగూ, చొక్కా- ఖాకీరంగువి ఇచ్చాడు. కాని ఆ బట్టలు నీరూపమే, నీరంగే! నువ్వే నీప్రియపుత్రుణ్ణి పొదువుకొన్నావు.

నువ్వు నీలో నవ్వుకున్నావు నేలతల్లీ! నీమీందేపడుకొనే నీ పుత్రుణ్ణి హృదయానకు అదుముకునేదానవు. ఇంటివారు కిందపడుకునే సుబ్బన్నను చూచి తిట్టేవారు, చివాట్లుపెట్టేవారు వాళ్ళకేమి తెలుస్తుంది మీ ఇద్దరిమధ్యనాఉన్న చుట్టరికం?

క్రిందపడుకొనే మనుష్యుడు దొంగఅవుతాడా నేలతల్లీ! వర్తకమని, వడ్డీఅని, పెట్టుబడిఅని, పెత్తనమని; కొట్లుపెట్టి, రవాణాలుచేసి, దిగుమతులుదింపి, మిల్లులు, పరిశ్రమలు పెట్టి నీ బిడ్డలరక్తంతాగే కోటీశ్వరులు దొంగలుకారూ? వాళ్ళు దొరలు, యజమానులు, ఖామందులు, మాలిక్‌లు, జమీందారులు, సంస్థానాధీశ్వరులు, ఫోర్డులు, రాక్‌ఫెల్లరులు, బీవర్‌బ్రూకులు, చర్చిల్లులు, అమెరీలు, హిట్లరులు, ఫ్రాంకోలు, నవాబులు, జాగీర్‌దారులు, వారు దేవతా పుత్రులు, నీ బిడ్డ సుబ్బన్న నేలపుత్రుడు.

సుబ్బన్న దొంగతనంచేయగలడా నేలతల్లీ? ఆతని యజమానిఇంట్లో వెండిగిన్నె పోయిందే అనుకో! అది సుబ్బన్న కెందుకు? నీలోనుంచి ఉద్భవించిన మోదుగ, అడ్డ, అరటి, తామర, పత్రిఆకులలో తినే సుబ్బన్నకు వెండిగిన్నా? నేలతల్లీ! నీ గర్భంలోంచివచ్చిన వెండి, బంగారము, రేడియము ప్లాటినము దేవతలు లాక్కొన్నారు కాదూ. అవన్నీ సత్యవంతులయిన నీబిడ్డలు కూలీలు, పొలంకాపులు, బిచ్చగాళ్ళు, గుంపులవాళ్ళు, అడవివాళ్ళు, ఊరిబయట విసిరివేయబడ్డ వాళ్ళు, బట్టలుదికేవాళ్ళు, పాయిఖానా ఎత్తేవారు, కుండలు చేసేవారు, దేవతలముఖాలు నిష్కరంచేసేవాళ్లు వాళ్ళకందరకీ ఉపయోగించిననాడుకాదూ నీసొమ్ము నీకవడం!

నీ సుబ్బన్న మాలిక్ ఇంట్లో వెండిగిన్నె పోగానే సుబ్బన్న తీశాడని అన్నారే, వారిహృదయం రాయి కాదు, రప్ప కాదు, కెమికల్ లేబరేటరీలో తయారయిన విషపు బాంబుగాని!

అల్లాఅంటే ఊరు పేరు లేని నీ అనుగు కుమారుడైన సుబ్బన్నకు వా శేమంటున్నారో అర్థమయిందా నేలతల్లి!

ఎన్ని దెబ్బలుకొట్టారు వాళ్ళూ, దేవతలయిన పోలీసులూ! నీ సుబ్బన్నకు తిండిఉందా? వంటినిండా పడిన గాయాలకూ, ఆ గాయాలవల్లా, పైగాయాలుకాకుండా కమిలిపోయిన దెబ్బలవల్లా వచ్చిన జ్వరానికి మందు వుందా నేలతల్లీ?

మెజస్ట్రీటుకోర్టులో కేసుపెట్టారా? ఆకేసు జరుగుతుండగానే ఆ గిన్నె-ఆ వెండిగిన్నె యజమానురాలు జాగ్రత్తకోసం ఇనప్పెట్టెలో పెట్టి ఆ విషయం మరిచిపోయిందా? అది మళ్ళీ కనబడిందా, ఆ విషయానికి ఆ యిల్లాలు ఓనికి వెండిగిన్నె దొరికిందని మేజస్ట్రీటుగారికి కబురుపంపిందా! అయ్యో నేలతల్లీ! సుబ్బన్నధర్మం నీకు తెలుసును.

తాముచేసిన అన్యాయానికి తలెత్తుకుతిరిగిన ఆ మాలిక్ హృదయంలో ఇంతసీసం ఉందేమో! నీసంకటన్నా నయమే తల్లీ! మనుష్యుల తెలివితనపు రాక్షసత్వం ఉంది. అది నిజం!

4

ఓ నేలతల్లీ! నీసుబ్బన్న ఆ యజమానుణ్ణి వదలి నడచి నడచి బొంబాయి చేరాడూ! బొంబాయిలో కొందరి కూలీల ధర్మమూ అని ఓ మిల్లులో చేరాడూ! ఆ మిల్లులో ఎన్ని గడబిడలు. ఆ మిల్లు కొందరి ధనేశ్వరుల కడుపులదా! వాళ్ళు ఈ కూలికిటికాల ధన మాన ప్రాణాలకు అధికారులా తల్లీ! నీ బిడ్డను సుబ్బన్నకూ అదేగతి! పనిచేయడానికి చీమనూ కూలీకి అతనికడుపు గుప్పెడా! తల్లీ, ఇదా మా కాపరం. అతను ఏవీధి

లోనో ఏ నాలుగంతస్తుల మేడముంగో నీ ఒడిలోనే పడుకుం టాడు ఏ రెస్టారెంటులోనో ఇంత రొట్టె తింటాడు

ఓ నేలతల్లీ! ఒకనాడు సుబ్బన్న ఇంకో కూలికుటుం బంతో స్నేహంచేశాడా? వాళ్ళూ హైదరాబాదువాళ్ళేనా! అవును, నీలోఉండే గమ్మత్తే అది. నీహృదయంలో ఏభాగంలో ఉన్నవాళ్ళు ఆభాగంవాళ్ళతో కలిసి మెలిసి ఉంటారుకాదూ!

ఆ కూలీ కుటుంబమూ ఎల్లాగో అనేకరకాల కూలిచేసి చిరిగినగుడ్డలుకట్టుకొని, వీలయితే ఆ బొంబాయి గల్లిలలో ఏ నల్లాకిందో స్నానంచేస్తారు తల్లీ. వాళ్ళూ నీవాళ్ళేనటమ్మా! ఆకుటుంబంవాళ్ళు సుబ్బన్నను దగ్గిరకు తీశారు. ఏతల్లి, ఏతండ్రికి పెండ్లిధర్మంలోనో, పెండ్లికి మించిన కామమహా ధర్మంలోనో కన్న సుబ్బన్నకు కాస్త మెదడు ఉంది సుమా! కళ్ళకాంతి కొంచెం నిశితమే!

ఆలా కాలంలో చుక్కానిలేని పడవలా కొట్టుకుపెళ్ళే సుబ్బన్నకు, ఆ ఇంకో నేలకుటుంబంలో ఓచుక్కాని-ఓచుక్క ఓ చక్కనిచుక్క; తలవంపుల, వాలుగన్నులవీధి కూలీమితారి; ఆ మేడల్లో ధనకుటుంబాలకు పనిచేసే వయ్యారి అతనికినేస్తం అయిందా! నేలతల్లీ నీ సుబ్బన్న కప్పుడు నువ్వు లోకానికి పరిపాదించిన సుగంధాలు, సౌందర్యస్వరూపాలు హృదయాని కెక్కాయా?

ఓ నేలతల్లీ కల్తీలేని ప్రేమ నీ సుబ్బన్నహృదయంలో ప్రవేశించిందా? వాళ్ళిద్దరూ లోకంలో మానవులందరికి ఉన్న జంటధర్మం నిర్వర్తింపసాగారా? నేలతల్లీ నువ్వు వాళ్ళ ఇదరి మహదానందమూ, ఓర్వలేని మానవకఠినత్వం కళ్ళకనబడ

కుండా చీకటని, దౌవతీ ఇసుక అని, సందని, తూమని, పార్కని ఆ మహానగరంలో వారికోసం సృష్టించావా తల్లీ!

ఆ సుబ్బన్నకు, సీతకు ఉన్న పవిత్రమైన చుట్టరికం సీత తల్లీ తండ్రీ గ్రహించారు. అది వాళ్ళిద్దరూ కోరిందేకాదూ, నేలతల్లీ! ఓ మంచిరోజున వాళ్ళిద్దరకు పెళ్ళి అని మూడు ముళ్ళూ వేయించారా తల్లీ!

సుబ్బన్న సీత ప్రేమలో లోకాలు ఆవరించాడా! అతని హృదయమూ జ్ఞానమూ, మనసూ పువ్వులులా వికసించాయా నేలతల్లీ!

5

ఓ నేలతల్లీ, ఏ ముందులోకంకోసం సుబ్బన్న సీతలు సూర్యోదయం చూస్తూ మలబారు కొండమీద నిలబడ్డారు?

నువ్వు ఆ బంగారు ఎరుపుల సూర్యకిరణాలు నీవు ధరించిన వస్త్రం కాగా ఆ నీయొక్క ఇద్దరిబిడ్డల ఆనందమూ చూస్తూ ఉన్నావా? వాళ్ళిద్దరికీ ఈ నీ దేశానికి సంబధం వాళ్లు ఇక్కడ ఎలాగో బ్రతికడమేనా? ఈ రాజ్యంలో వాళ్ళకు భాగంలేదా? ఈ దేశంసొమ్ములో ఈ దేశంలో ఉద్భవించే పంటలో, ఈ దేశంలో రూపంపొందేవస్తువులలో వారికి భాగం లేదా?

వారిద్దరూ చూచే ఆ సూర్యబింబంలో వారి భవిష్యత్తును ఏమిచూచారు! వారిద్దరి చెమటా, వారిమురికిగుడ్డలు, వారికివచ్చే గట్టికష్టాలు స్వచ్ఛమైన దుఃఖాలూ, అమృతము రంగరించిన ఆనందాలూ మాత్రమే వారి ఆస్తిపాస్తులా నేలతల్లీ

ఆరాత్రి సుబ్బన్న సీతను, ఆ బట్టలమిల్లువారు కట్టించిన పేటలో వాళ్ళవంతుకు వచ్చిన ఇంటిలో గట్టిగా [నిన్ను కౌగలించుకునే ఎండలా] వెన్నెలలా గాలిలా కౌగిలించుకొన్నాడా? నిన్ను గాఢంగా చుంబించే వానలా సుబ్బన్న సీతను ముద్దుపెట్టుకున్నాడా? ఆరాత్రే సీతమ్మగర్భంలో సర్వదేశాలకూ మకుటంకాబోయే నీ భారతీయదేశానికి నిజపౌరులలో ఒకడు కాదలచుకున్న ఇంకోచిన్న సుబ్బన్న అవతరించాడా? నువ్వు ఉప్పొంగిపోయావా?

సుబ్బన్న తనచుట్టూఉన్న అర్థంకాని ఏవో ఇనపగోడలు పగలగొట్టాలన్న ఆవేదనపడేవాడా నేలతల్లీ? అందుకు ఆతనిలో బాంబుశక్తి విజృంభించగలదా?

మిల్లులో యుద్ధావసరాలకు తగినట్లు కూలీలకు కూలీ సరిగా ఎక్కువ చేయలేదూ, అందుకు నాయకుడు కూలీలసభ చేశాడూ, ఆ సభలో సుబ్బన్న అంత అద్భుతంగా, మహో వేగంతో, గంగానదిలా వర్షవాయువులా మాట్లాడుతూంటే నువ్వు నీపుత్రుని విని ఎంత ఆనందించావు?

కూలీలు దేశానికి రక్ష అన్నావా సుబ్బన్నా! విమానాలు, టాంకులు, రైళ్లు, ఓడలు, బాంబులు, తుపాకులు, వస్త్రాలు, సామానులు, కాగితాలు, కలాలు, మేడలు, మిద్దెలు, రోడ్లు, మోటార్లు తయారుచేసేవారు కూలీలు వారుమాత్రం బ్రతకక అక్కరలేదూ అన్నాడా సుబ్బన్న; సీత తనవయసుకాని గంభీరవచనాలకు ఆనందంతో ఊగిపోయిందా కూలితల్లీ.

యజమానులు కూలీలకోర్కె పాలించరో, కూలీలందరూ సమ్మెచేశారా! అందుకు నీబిడ్డడు ఒక ముఖ్యనాయకుడా నేలతల్లీ! అతన్ని అరెస్టుచేశారా! ఆరోజు సీతమ్మ కుంగిపోతే, నువ్వేకాదూ అపరిమితమైన ధైర్యంచెప్పి, ఆ బాలను వీరబాలికను చేశావు!

సుబ్బన్నను వదిలివేయడానికి కారణం దేశనాయకులు కొందరు మిల్లుయజమానులతో రాయబారాలు సలపడంవల్లా నేలతల్లీ!

సుబ్బన్నజీతమూ వృద్ధిఅయింది. సీతమ్మజీతమూవృద్ధి అయింది. నేలతల్లీ, అప్పుడు మాత్రం నీకు తృప్తిఅయిందా?

ఆ ఆదివారం నీపుత్రుడు సుబ్బన్నా, సుబ్బన్నహృదయమూ, ప్రాణమూ, ఆత్మా అయిన సీతా రైలెక్కి జుహూ గాంధీమహాత్ముణ్ణి దర్శించడానికే వెళ్ళారుకాదూ!

ఆ స్వాతంత్ర్యావతారాన్ని చూచి నమస్కరించి, అక్కడ సముద్రంఒడ్డున సాయంత్రం కూచొని ఒకరిదగ్గర ఒకరుగా ఇద్దరూ ఒకరుగా సీతమ్మగర్భంలో భావిభారతపురుషుడైన సుబ్బన్న ద్వితీయరూపం నృత్యం చేస్తూఉండగా— ఇద్దరూ— ఆకాశం— చీకట్లు— సముద్రతీరాలు— భవిష్యత్తు భారతీయ మానవుల హృదయపరిణయం దర్శిస్తూ కూర్చుని ఉన్నారుకాదూ? వారిద్దరినీ ఆ రాబోయే మూడవవానిని నీ ఒడిలో ఉంచుకొని నేలతల్లీ! చిరునవ్వుతో నవ్వావా!

ఇంకో కొత్తరోజు ఉదయిస్తుందికాదూ?